మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 61
పేజీలు : 3
శుక్రవారం
19.09.2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఏసీబీకి చిక్కిన ఆర్ఐ, సర్వేయర్

**టీ మీడియా, సెప్టెంబర్ 18, కొత్తకోట :**
వనపర్తి జిల్లా కొత్తకోట తహసీల్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఇద్దరు రెవెన్యూ అధికారులు అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. గురువారం కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీ వాసు, మండల సర్వేయర్ నవీన్ రెడ్డి బాధితుడి నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బంధువుల భూమికి సంబంధించి విచారణ నిర్వహించి ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్ జారీ చేయాలని తహసీల్ కార్యాలయంలో సంప్రదించగా అందుకు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం మధ్యాహ్నం మాటు వేసి ఆర్ఐ, సర్వేయర్‌ను పట్టుకుని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని, లేదా వాట్సప్‌లో సమాచారం అందించాలని అధికారులు సూచించారు.



# జీఎస్టీ 2.0 సంస్కరణలను..
# స్వాగతించిన సీఎం



- మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- తాను ఎప్పుడూ ముందుంటానని వెల్లడి

**టీ మీడియా, సెప్టెంబర్ 18,అమరావతి బ్యూరో :** జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ అందించేలా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. దీని కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలపై ఈనెల 22న యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామని ప్రకటించారు.జీఎస్టీ 2.%ఉ%.ని స్వాగతిస్తూ శాసనసభలో జరిగిన చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జీఎస్టీ నూతన విధానం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సంస్కరణలకు ఎప్పుడూ తాను మద్దతిస్తానన్న సీఎం, అందుకే జీఎస్టీ 2.%ఉ%ని స్వాగతిచ్చినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నా తనకు దేశం, రాష్ట్రం, ప్రజలే ముఖ్యమని ఉద్ఘాటించారు.ప్రధాని మోదీ సంస్కరణలతో పరోక్ష పన్ను చెల్లింపుదారులు పెద్దఎత్తున పెరిగారని సీఎం తెలిపారు. కొత్త పన్నుల వినియోగం పెరిగి, ఆర్థిక వ్యవస్థకు 2 లక్షల కోట్లు సమకూరుతుందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు చివరి వ్యక్తి వరకు అందేలా చేయడం మన బాధ్యత అని ప్రజా ప్రతినిధులకు సీఎం సూచించారు. దాని కోసం మంత్రివర్గ ఉపసంఘం నియమిస్తామని శాసనసభలో ప్రకటించారు.వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో జీఎస్టీ సంస్కరణలు ఊతమిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. జీఎస్టీ స్లాబుల మార్పుల వల్ల దేశంలోని 140 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. నూతన సంస్కరణల వల్ల ఏపీకి కొంత నష్టం ఉన్నా, దేశ విశాల ప్రజయోజనాల దృష్ట్యా స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

**రాష్ట్ర ప్రతినిధిగా బాధ్యత వహించా**

దేశంలోని ప్రతి పౌరుడికి లబ్ధి జరిగేలా జీఎస్టీ సంస్కణరణలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పన్నుల భారం తగ్గడం ద్వారా ప్రజలకు ఆదాయం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అందుకే జీఎస్టీ 2.0కు ఆంధ్రప్రదేశ్ మద్ధతు ఇస్తోందని అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా పవన్ స్పష్టం చేశారు. జీఎస్టీ సంస్కరణలు దేశ ప్రగతికి బాటలు వేస్తాయని అన్నారు. జీఎస్టీ సంస్కరణల్లో ఒక దానికి రాష్ట్ర ప్రతినిధిగా బాధ్యత వహించినట్లు పవన్ తెలిపారు.సంస్కరణలను ముందుండి నడిపిన నిర్మలా సీతారామన్ కృషి అభినందనీయమని, రాష్ట్ర ఆదాయానికి నష్టం కలిగినా సామాజిక ప్రయోజనాల కోసం సమర్థించామని చెప్పుకొచ్చారు. చరిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తు చేశారు. జీఎస్టీ పన్ను విధానం సులభతరం ద్వారా ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని, వ్యాపారులపై పన్నుల భారం తగ్గి, పన్నుల వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందన్నారు. ప్రజల పొదుపు పెంచి, కొనుగోలు శక్తి పెంపొందించేందుకు దోహదం చేస్తుందని అన్నారు. స్థిరమైన వృద్ధి మార్గంలో నిలపడానికి ఈ సంస్కరణలు ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. కొత్త పెట్టుబడులు పెంచి, ఆర్థిక వృద్ధికి దారి తీస్తుందని పవన్ వెల్లడించారు.జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూ ఏకగ్రీవ తీర్మానం: జీఎస్టీ మార్పులను స్వాగతిస్తూ అసెంబ్లీలో చర్చకు ముగింపుగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీర్మానం ప్రతిపాదించారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించిన చంద్రబాబును అభినందిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించగా సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కేంద్ర తీసుకున్న నిర్ణయం పై జీఎస్టీ కౌన్సిల్?లో ఏపీ అభిప్రాయాన్ని చెప్పడానికి ముందు జరిగిన పరిణామాలను కేశవ్ సభకు వివరించారు. జీఎస్టీ సంస్కరణలతో ఏపీకి 8 వేల కోట్ల ఆదాయం తగ్గుతుందని తాను చెబితే, చంద్రబాబు మాత్రం ప్రజలకు 8 వేల కోట్లు మిగులుతాయని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. చంద్రబాబుకు ప్రజలపై ఎంత మనసు ఉందో ఇదే నిదర్శనంగా అభివర్ణించారు.జీఎస్టీ సంస్కరణలపై 15 మంది సభ్యులు ఆలోచనలు పంచుకున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. జీఎస్టీ సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సుదీర్ఘ చర్చ జరిగిందని అన్నారు. జీఎస్టీ సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై కేబినెట్ సబ్‌కమిటీ వేస్తామన్న పయ్యావుల, ఏపీలో తరచూ వాడే 470 ఉత్పత్తులపై జీఎస్టీ ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల అమలులో సీఎం చంద్రబాబు పాత్ర కూడా ఉందని, ప్రభుత్వం తరఫున సీఎంకు ధన్యవాదాల తీర్మానం సందర్భంగా పయ్యావుల వ్యాఖ్యానించారు.

### కుమారుడి రిసెప్షన్ క్యాన్సిల్ చేసి..
# రైతులకు రూ.2 కోట్లు ఇచ్చిన ఎమ్మెల్యే

**రాష్ట్ర ప్రభుత్వానికి విరాళం అందజేత**



**టీ మీడియా, సెప్టెంబర్ 18, హైదరాబాద్ బ్యూరో :**
ఓ ప్రజా ప్రతినిధి తలచుకుంటే తన కుమార్తె/ కుమారుడు పెళ్లిని ఎంతో వైభవంగా జరిపించొచ్చు. ఆకాశమంత పందిరి వేసి, ఊరందరినీ పెళ్లికి ఆహ్వానించవచ్చు. రకరకాల పిండి వంటలు వండి, వచ్చిన అతిథులకు విందు భోజనం వడ్డించవచ్చు. కానీ ఈ ఎమ్మెల్యే అలాంటి హంగూ ఆర్భాటాలు ఏమీ చేయలేదు. చాలా సింపుల్?గా తన కుమారుడి వివాహం జరిపించారు. ఆపై రిసెప్షన్? చేయకుండా మానవతాకోణంలో ఆలోచించి, రైతులకు లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకుని ఆచరణలో పెట్టారు. వివరాల్లోకి వెళితే..

**కుమారుడి రిసెప్షన్ రద్దు చేసి**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుమారుడి వివాహం ఇటీవల వైభవంగా జరిగింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే తన ఉదారతను చాటుకున్నారు. కుమారుడి రిసెప్షన్ రద్దు చేసి, ఆ డబ్బులను తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా రూ.2 కోట్ల చెక్?ను రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు అందించారు. సీఎం రేవంత్ ?రెడ్డిని కలిసి చెక్?ను అందజేశారు. ఈ సహాయం ద్వారా లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు.ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మొదట భావించారు. అయితే రాష్ట్రంలో యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. కుమారుడి రిసెప్షన్‌ను రద్దు చేసుకుని, ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చి ముఖ్యమంత్రికి రూ.2 కోట్ల చెక్ అందించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులను సీఎం అభినందించారు.

**అసలు కథ ఇది**

యూరియా కోసం రాష్ట్రంలో రైతులు ఇప్పటికే ఎరువుల దుకాణాల ఎదుట రైలు బండి మాదిరిగా క్యూలైన్లు కడుతున్న దృశ్యాలు చూస్తూనే ఉన్నాం. రాత్రీపగలు అనే తేడా లేకుండా తమ చెప్పులు, సంచులను క్యూలైన్లలో పెట్టి యూరియా బస్తాల కోసం వేచి చూస్తున్నారు. ఇతర పనులు మానుకుని మరీ పొద్దంతా ఎరువుల దుకాణాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. కొరతను నిరసిస్తూ కొన్నిచోట్ల నిరసన జ్వాలలు రేగుతుండగా, మరికొన్ని చోట్ల పోలీసుల బందోబస్తు మధ్య బస్తాల పంపిణీ కొనసాగుతోంది. ఇంత చేసినా అన్నదాతలకు సరిపడా ఎరువు బస్తాలు మాత్రం ఇంకా అందడం లేదు.ప్రజాప్రతినిధులు, పలుకుబడి ఉన్నవాళ్లు ఫోన్లు చేసినా సరే ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. తాజాగా మిర్యాలగూడ ఎమ్మెల్యే తన నియోజకవర్గ ప్రయోజనాల కోసం రూ.2 కోట్ల చెక్? ఇచ్చి, ప్రభుత్వానికి తనవంతు సహకారం అందించారు. ఈ ఎమ్మెల్యేను ఆదర్శంగా తీసుకొని, మరింత మంది ప్రజాప్రతినిధులు ముందుకు వస్తారేమో చూడాలి. ఏదేమైనా తన కుమారుడి వివాహాన్ని గ్రాండ్?గా చేయకుండా, ఇలా రైతుల కోసం ఆలోచించిన ఈ ఎమ్మెల్యే ఆలోచనకు సెల్యూట్? చేయాల్సిందే.



# కృష్ణా బేసిన్‌పై 16 ప్రాజెక్టులు

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**
**డీపీఆర్‌ల తయారీకి ఆదేశాలు**

**టి మీడియా, సెప్టెంబర్ 18, హైదరాబాద్ బ్యూరో :**
కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులు, నీటి వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదనపు నీటి వినియోగానికి, కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించింది. ఇప్పటికే అక్కడ వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యం పెంపు, గతంలో సర్వేల కోసం ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత ముందుకు పడని పలు ప్రాజెక్టులను తెరపైకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో మొత్తం 16 పథకాలకు సర్వే, ఇన్వెస్టిగేషన్?, సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీకి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్? బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు.ఇలా మంగళవారం కృష్ణా బేసిన్? ప్రాజెక్టులు, అదనపు నీటి వినియోగంపై జారీ చేసిన ఈ ఉత్తర్వులు బుధవారం వెలుగులోకి వచ్చాయి. ఇన్ని పథకాలకు ఒకేసారి, అదీ ఒకే ఉత్తర్వుతో డీపీఆర్‌ల తయారీకి ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకొంది. కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్?కుమార్? రెడ్డి పలు దఫాలుగా నీటిపారుదల శాఖ అధికారులు, సలహాదారులు, సీనియర్? న్యాయవాదులు, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం ఇంజినీర్లతో చర్చించారు. అనంతరం అన్ని పథకాలకు ఒకేసారి ఆదేశాలు జారీ అయ్యాయి.

**ముఖ్య వివరాలివీ**

ఈ నెల 23 నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో వచ్చిన జీవోలోని ముఖ్యమైన అంశాలు, ఏయే పథకాలకు డీపీఆర్ తయారీ అన్న వివరాలు ఇలా ఉన్నాయి.రేలంపాడు బ్యాలన్సింగ్? రిజర్వాయర్‌ను నాలుగు నుంచి పది టీఎంసీలకు పెంచడం. అలాగే గట్టు బ్యాలన్సింగ్ రిజర్వాయర్? సామర్థ్యం 1.32 నుంచి 5 లేదా 10 టీఎంసీల సామర్థ్యానికి పెంచడం. జూరాల నుంచి నాలుగు టీఎంసీలు తీసుకొని అదనంగా 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు నెట్టెంపాడు రెండోదశ పనులు కోసం చేయనున్నారు.పులి చింతల వెనకభాగం నుంచి బొజ్జతాండా, భీమతాండా ఎత్తిపోతలు పథకం. 0.5 టీఎంసీ వినియోగంతో మట్టంపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో 1,380 ఎకరాల ఆయకట్టుకు నీరందించడం జరుగుతుంది.

జూరాల నుంచి రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 టీఎంసీలు మళ్లించేలా వరద కాలువ పథకం ఉంది. నల్గొండ, మహబూబ్?నగర్?, వరంగల్?, ఖమ్మం జిల్లాల్లో 11.3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే పథకం, మార్గం మధ్యలో చెరువులను నింపడం. అలాగే జూరాల వెనక భాగం నుంచి వరద సమయంలో 123 టీఎంసీలను మహబూబ్?నగర్? జిల్లాలోని దుర్భిక్ష ప్రాంతాలకు సరఫరా చేయడం వంటివి ఉన్నాయి.

కోయిల్?సాగర్? కింద 3.3 టీఎంసీలతో అదనంగా 13,500 ఎకరాలకు సాగు నీరు అందించడం.కల్వకుర్తి ఎత్తిపోతల రెండో దశ కింద శ్రీశైలం నుంచి 13 టీఎంసీలను మళ్లించి 93,531 ఎకరాల అదనపు ఆయకట్టు సాగులోకి రానుంది. ఇందుకోసం కాలువలు, హెడ్? వర్క్స్ సామర్థ్యం పెంచడంతో పాటు తాగునీటికి 7.12 టీఎంసీలు వినియోగించుకొనేలా మౌలిక సదుపాయాల కల్పనకు నివేదికను తయారు చేశారు. మహబూబాబాద్? జిల్లా డోర్నకల్? మండలం ముల్కపల్లి వద్ద 25 నుంచి 35 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నారు. మహబూబాబాద్? జిల్లాలో 1.3 టీఎంసీలతో 13,201 ఎకరాలకు సాగు నీరిచ్చేందుకు మహబూబాబాద్? మండలం ఏదులపూసపల్లి వద్ద మున్నేరు నదిపై బ్యారేజీ నిర్మాణం చేయనున్నారు. ఇదే జిల్లాలోని మరిపెడ మండలం విసంపల్లి గ్రామం వద్ద ఆకేరు నదిపై 1.2 టీఎంసీలతో బ్యారేజీ నిర్మాణం చేయనున్నారు. గార్ల మండలం ముల్కనూరు గ్రామం వద్ద 11,871 ఎకరాలకు నీరిచ్చేందుకు మున్నేరుపై 1.2 టీఎంసీలతో బ్యారేజీ నిర్మాణం.హైదరాబాద్?, చుట్టుపక్కల ప్రాంతాల తాగునీటి అవసరాలకు 3 రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టనున్నారు. దేవులమ్మనగరం, దుండుమల్లారం వద్ద పదేసి టీఎంసీల చొప్పున, ఆరుట్ల వద్ద 5 లేదా 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లకు డీపీఆర్?ల తయారీ చేపట్టనున్నారు.శ్రీశైలం ఎడమగట్టు కాలువకు కొనసాగింపుగా నాగర్? కర్నూల్? జిల్లా కొల్లాపూర్? మండలం సోమశిల గ్రామం వద్ద నుంచి శ్రీశైలం బ్యాక్?వాటర్? రోజుకు ఒక టీఎంసీ చొప్పున మళ్లించి 35 టీఎంసీల వినియోగంతో 3.99 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీటి సరఫరా చేయనున్నారు.ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఏదులచెరువు గ్రామం వద్ద ఆకేరు నదిపై బ్యారేజీ నిర్మించి 1.3 టీఎంసీల వినియోగంతో 13,129 ఎకరాలకు నీటిసరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు.

### హైదరాబాద్‌లో
# భారీ వర్షం

**చెరువులుగా మారిన రహదారులు**

**ఇళ్లలోకి చేరిన వరదనీరు**



**టీ మీడియా, సెప్టెంబర్ 18, హైదరాబాద్ బ్యూరో:**
హైదరాబాద్‌ను వరుణుడు వీడటం లేదు. అకాల వర్షాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్? నగరాన్ని వరదమయం చేసిన వర్షం కాస్త విరామమిచ్చిందనుకునేలోపు గురువారం సాయంత్రం మళ్లీ మొదలైంది. ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిగా నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.జూబ్లీహిల్స్?, బంజారాహిల్స్?, పంజాగుట్ట, శ్రీనగర్?కాలనీ, కృష్ణానగర్?, యూసుఫ్?గూడ, ఎస్?ఆర్?నగర్, అమీర్?పేట, బోరబండ, చార్మినార్, బహదూర్?పుర, చాంద్రాయణగుట్ట, యాకుత్?పుర, ఫలక్?నుమా, బార్కస్? ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. వరదనీటితో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పంజాగుట్ట మోడల్ హౌస్ ముందు రహదారి చెరువులా మారిపోయింది. మోకాలి లోతు నీరు రావడంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమాజిగూడ సర్కిల్‌కు ఎగువ నుంచి భారీగా వర్షపు నీరు వరదలా వస్తోంది. దీంతో ఖైరతాబాద్, సోమాజిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది.

**రాత్రి 7 గంటల వరకు వర్షం**

రహదారులు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి 7 గంటల వరకు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు సుచిత్ర, కొంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, గుండ్లపోచంపల్లి, సూరారం, జీడిమెట్ల, చింతల్, షాపూర్ నగర్, గాజుల రామారం, జగద్గిరిగుట్ట, బాలానగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. విస్తారంగా కురుస్తున్న వానలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షంతో స్కూళ్లు, కళాశాలలు, ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడి అవస్థలు పడుతున్నారు.

**సికింద్రాబాద్‌లో భారీ వర్షం**

సికింద్రాబాద్? పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. రైల్వే స్టేషన్, ప్యాట్నీ, ప్యారడైస్, బేగంపేట, బోయిన్?పల్లి, తిరుమలగిరి, అల్వాల్,? బొల్లారం, మారేడుపల్లి, సీతాఫల్?మండి ప్రాంతాల్లో జల్లులు కురుస్తున్నాయి. మనోహర్? థియేటర్? సమీపంలో రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు, ఆఫీస్? నుంచి వచ్చే వాళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో రహదారులపై చేరుతున్న వరదనీటితో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. హైడ్రా, జీహెచ్?ఎంసీ, పోలీస్ శాఖల వారు రహదారులపై నీటిని పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. ?

**అవసరమైతే తప్ప బయటకు రావొద్దు**

భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్? సమస్య ఏర్పడకుండా ట్రాఫిక్?, హైడ్రా బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. నిన్నటి నుంచి దంచికొడుతున్న వర్షాలతో హైదరాబాద్? అతలాకుతలమైంది. ఆఫీసుల నుంచి వాహనదారులు ఒకేసారి కాకుండా విడతల వారీగా రావాలని అధికారులు సూచిస్తున్నారు. వరదనీటితో నాలాలు పొంగిపొర్లుతున్నాయి. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో 3 రోజుల పాటు తేలికనుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్? వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## ఆటో డ్రైవర్లుగా అతివలు
2లో..

# సాయిబాబా సంస్థాన్ నకిలీ వెబ్‌సైట్

## మోసపోయిన భక్తులు!




**టీ మీడియా, సెప్టెంబర్ 18, శిర్డీ :**
శిర్డీ అనేది ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది భక్తుల ఆధ్యాత్మిక కేంద్రం. రోజూ వేలాది మంది భక్తులు సాయిబాబా దర్శనార్థం ఇక్కడకు వస్తుంటారు. భక్తుల సౌలభ్యం కోసం సాయిబాబా సంస్థానం భక్త నివాసం, విరాళాలు, దర్శన పాస్ వంటి సేవలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చింది. అయితే, దీనినే అవకాశంగా తీసుకొని కొంత మంది మోసగాళ్లు భక్తులను మోసం చేస్తున్నారు. తాజాగా గుర్తు తెలియని ఓ వ్యక్తి సాయి సంస్థాన్ భక్తన్ నివాస్ పేరుతో నకిలీ వెబ్?సైట్?ను సృష్టించాడు. ఆ నకిలీ వెబ్?సైట్ ద్వారా? ఓ ఫ్యామిలీ మోసం పోవడంతో ఈ విషయం వెలుగులో వచ్చింది.

**అసలేం జరిగిదంటే?**
కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన రాము జాదవ్ అనే వ్యక్తి తన మనవడి పుట్టిన రోజు సందర్భంగా కుటుంబంతో కలిసి శిర్డీకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం రాము కుమారుడు గూగుల్?లో శిర్డీ సాయిబాబా వెబ్?సైట్ కోసం సెర్చ్ చేశాడు. అతడికి సాయి సంస్థాన్ భక్తన్ నివాస్ అనే పేరుతో ఓ వెబ్?సైట్ కనిపించింది. అదే అధికారిక వెబ్?సైట్ అనుకుని గది బుకింగ్ చేశాడు. తర్వాత నగదు కోసం వాట్సాప్?లో ఓ స్కానర్?ను పంపించారు. దాని నుంచి రూ.2100 చెల్లించాడు. రశీదును భక్తనివాస కౌంటర్ వద్ద ఇస్తామని చెప్పారు. ఆ తర్వాత రాము కుటుంబ శిర్డీకు వెళ్లారు. అక్కడ భక్తనివాసానికి చేరుకున్న తర్వాత తమ పేరుతో ఎలాంటి బుకింగ్? కాలేదని చెప్పారు. దీంతో వాళ్లు మోసపోయినట్లు తెలుసుకున్నారు.సాయిబాబా సంస్థాన్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. నకిలీ వెబ్‌సైట్‌ల ద్వారా భక్తులను మోసం చేస్తున్నవారిపై శిర్డీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది అని సంస్థాన సీఈఓ గోరక్ష గడీల్కర్ తెలిపారు. సాయిబాబా సంస్థానం పేరుతో నకిలీ వెబ్‌సైట్‌లు తయారు చేసి, రూమ్ బుకింగ్, విరాళాలు, దర్శన పాస్ పేర్లతో అనేక మంది భక్తులను మోసం చేసినట్లు ఇంతకు ముందు కూడా కేసులు నమోదయ్యాయి.సాయి ఆశ్రమ భక్తన్ నివాస్ పేరుతో నకిలీ వెబ్‌సైట్ ద్వారా మోసం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందిందని శిర్డీ సబ్ డివిజన్ పోలీసు ఆఫీసర్ అమోల్ భారతి తెలిపారు. సాయిబాబా సంస్థాన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి, సైబర్ సెల్‌కి అప్పగించినట్లు పేర్కొన్నారు. దీనిని అహల్యానగర్ సైబర్ సెల్?కు పంపినట్లు చెప్పారు.

**అధికారిక వెబ్‌సైట్ వాడాలని సలహా**
నకిలీ వెబ్?సైట్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సాయిబాబా సంస్థాన్, శిర్డీ పోలీస్‌లు సూచించారు. రూం బుకింగ్, విరాళాలు, దర్శన పాస్ కోసం కేవలం సంస్థానం అధికారిక వెబ్‌సైట్ %ఆఆఆ.యిఱ.శీతీస్త్ర.ఱఅ% నే ఉపయోగించాలని చెప్పారు. లేదా సంస్థానం అధికారిక కాంటాక్ట్ నంబర్ల ద్వారా సమాచారం పొందాలని తెలిపారు. గూగుల్‌లో కనిపించే ఇతర వెబ్‌సైట్‌లు లేదా అపరిచిత మొబైల్ నంబర్లకు డబ్బులు పంపవద్దని తెలిపారు. భక్తులు కూడా అధికారిక వెబ్‌సైట్ ద్వారానే లావాదేవీలు చేయాలని అన్నారు. ఇలా చేస్తే భవిష్యత్తులో ఇలాంటి మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని సూచించారు.



## సీసీ రోడ్డు కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన

**టీ మీడియా, సెప్టెంబర్ 18, మేడ్చల్:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ సింహపురి కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్, ఎన్. ఎమ్, సి జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, వీరబాబు, ఆది రెడ్డి, నారాయణరెడ్డి, వాసు, ఆంజనేయ వర్మ, శ్రీనివాస్, రఫాత్, ప్రశాంత్ రెడ్డి, సందీప్, మహేష్, కాలనీ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, బాల్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరావు, రామ్‌కుమార్, సత్యనారాయణ రావు, శ్రీనివాస్, అఖిల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తూడి

**టీ మీడియా సెప్టెంబర్ 18 వనపర్తి బ్యూరో :**
గురువారం నియోజకవర్గ పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సి ఎమ్ ఆర్ ఎఫ్ఎ చెక్కులక్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగింది.ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు 10 లక్షల ఆరోగ్య భీమా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం 200 యూనిట్ల ఉచిత కరెంటు రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా 500 కే గ్యాస్ సిలిండర్ ప్రతి పేద కుటుంబానికి సన్నబియ్యం ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరిగింది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు .అభివృద్ధి చేస్తుంటే టిఆర్ఎస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని, వనపర్తి పట్టణం, వనపర్తి మండలం, పెబ్బేరు, శ్రీరంగాపురం, గోపాల్పేట, రేవల్లి, ఏదుల, ఖిల్లా ఘనపూర్, పెద్దమందడి మండలాలకు సంబంధించిన లబ్ధిదారులతో పాటువ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ లు, జిల్లాగ్రంథాలయాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు, పాల్గొనడం జరిగింది.



## ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**టీ మీడియా, సెప్టెంబర్ 18, వనపర్తి బ్యూరో :**
వర్షాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంటుందని, కావున రైతులు అప్రమత్తంగా పట్టపుల దగ్గరికి వెళ్లి క్రమంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.వనపర్తి సెప్టెంబర్-18 గురువారం రోజు జిల్లా పోలీసు కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్ వ్యవసాయ పంట పొలాలలో విద్యుత్ ప్రమాదాల నివారణ గురించి వనపర్తి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్సైలతో దృశ్య సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వనపర్తి జిల్లాలో రైతులు తమ వ్యవసాయ పొలాలో పంటలను పండించుకునేందుకు విద్యుత్ మోటర్లను ఏర్పాటు చేసుకుంటారు. వర్షాకాలం అయినందుకు తడిగా ఉండడం గమనించక రైతులు విద్యుత్ షాక్ తో ఈ సంవత్సరం వనపర్తి జిల్లాలో 11 మంది రైతులు మరణించారు. కుటుంబ యజమాని మృత్యువాతపడడంతో కుటుంబాలు రోడ్డున పడి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని కావున జిల్లాలో వ్యవసాయ రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా నివారించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల్లో విధిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యుత్ ప్రమాద మరణాల నుంచి రైతులను కాపాడాలని ఎస్పీ గారు తెలిపారుఈ దృశ్య సమీక్ష సమావేశంలో స్పెషల్ బ్రాంచి సీఐ, నరేష్, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## జస్ట్ రూ.300 కోసం గొడవ..

- ఏకంగా ఆటో డ్రైవర్ ప్రాణాలు తీశారు

**టి మీడియా : సెప్టెంబర్ 18 జగిత్యాల:**
జిల్లాలో అమానుష ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. 300 రూపాయల కోసం ఓ వ్యక్తి బలయ్యాడు. జగిత్యాల మండలం పొలాస శివారులో ఆదివారం (సెప్టెంబర్ 14) ఆటోడ్రైవర్ నయీముద్దీన్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసులు. హత్యకు సంబంధించి షాకింగ్ విషయాలను వెల్లడించారు.. జగిత్యాల మండలం పొలాస శివారులో ఆదివారం (సెప్టెంబర్ 14) ఆటోడ్రైవర్ నయీముద్దీన్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసులు. ఈ మేరకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ హత్యకు సంబంధించి షాకింగ్ విషయాలను వెల్లడించారు.
ఆటో కిరాయి విషయంలో నెలకొన్న వివాదం కారణంగానే బీహార్‌కు చెందిన దర్శన్ సాహ్ని, సునీల్ సాహ్ని అనే ఇద్దరు నయిముద్దీన్‌ను అత్యంత పాశవికంగా కొట్టి చంపినట్టు డీఎస్పీ రఘు చందర్ తెలిపారు. నిందితులిద్దరూ హైదర్‌పల్లి శివారులోని శ్రీ మణికంఠ రైస్ మిల్లులో కూలీలుగా పని చేస్తున్నట్లు గుర్తించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించినట్లుగా తెలిపారు. 24 గంటలు గడవక ముందే నిందితులను పట్టుకొని రిమాండ్ చేసిన రూరల్ పోలీసులను %ఇూ్రా% ప్రత్యేకంగా అభినందించారు.




## ఆటో డ్రైవర్లుగా అతివలు

- పురుషులతో సమానంగా ఉపాధి

**టి మీడియా, సెప్టెంబర్ 18, తిరుపతి :**
జీవితంలో ఎదురైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. విధి చిన్నచూపు చూసినా ఎదిరించి సొంత కాళ్లపై నిలదొక్కుకున్నారు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు కదులుతూ నిరాశలో కూరుకుపోయిన ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ సాయంతో ఆటోడ్రైవర్లుగా శిక్షణ పొంది మగవారితో సమానంగా స్వయం ఉపాధి పొందుతున్న తిరుపతి మహిళలపై కథనం.

**రాస్ సంస్థ సహకారంతో**



భర్త అకాల మరణంతో ఒకరు. అప్పటి వరకు ఉపాధి కల్పించిన పరిశ్రమ మూతపడటంతో మరొకరు. సరైన ఉద్యోగం లేక ఇంకొకరు. ఇలా ప్రతి ?ఒక్కరి జీవితాలలో ఏదో ఒక సమస్య. వీటన్నింటి నుంచి బయటపడి సరికొత్త జీవితం ఆరంభించారా మహిళలు. తిరుపతి కేంద్రంగా స్వచ్ఛంద సేవలు అందిస్తున్న రాస్ సంస్థ సహకారంతో ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ పొంది స్వయం ఉపాధితో కుటుంబాలను పోషిస్తున్నారు. మగాళ్లకు మాత్రమే అనుకొనే ఆటో డ్రైవింగ్‌లో ప్రవేశించి ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాల్లో సరికొత్త వెలుగులు నింపుకొన్నారు.తిరుపతి కేంద్రంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన డ్రైవింగ్ శిక్షణలో చేరిన వీరంతా ఆటో నడపటంలో మెళకువలు నేర్చుకున్నారు. నిరంతర అభ్యాసంతో డ్రైవింగ్ పై మంచి పట్టు సాధించి రవాణాశాఖ నుంచి అన్ని అనుమతులు పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు సొంతంగా ఆటోలను నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలను చేరుస్తున్నారు.కనీసం రూ.1000 సంపాదిస్తూ: నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్, రైల్వేస్టేషన్, శ్రీనివాసం, విష్ణు నివాసం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద ఆటోను నడుపుతూ రోజుకు కనీసం రూ.1000 సంపాదిస్తూ తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న తమకు ధైర్యాన్నిచ్చి స్వయం ఉపాధి పొందేలా రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ అవకాశం కల్పించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలకు భయపడకుండా, కష్టాలకు కుంగిపోకుండా ధైర్యంగా అడుగు ముందుకేస్తేనే విజయం వరిస్తుందని నిరూపిస్తూ ఈ మహిళ ఆటోడ్రైవర్లు మరెందరో అతివలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

## సాయికుమార్ చిత్రపటానికి నివాళులు

**టీ మీడియా సెప్టెంబర్ 18 వనపర్తి బ్యూరో :**
సామాజిక కార్యకర్త బి సాయి కుమార్ ఈమధ్య అనారోగ్య కారణంగా మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సాయికుమార్ మిత్ర బృందం సంద వెంకటస్వామి, బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి సాయి కుమార్ మరణం తీరని లోటని భౌతికంగా ఆయన మన మధ్యలో లేనప్పటికీ చిరస్థాయిగా మన హృదయాలలో నిలిచిపోయిన వ్యక్తి అని ఆయన చేసిన ప్రజాసేవ కార్యక్రమాలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించారు. సాయికుమార్ మిత్ర బృందం ఆధ్వర్యంలో పళ్ళ పంపిణీ, అన్నదాన కార్యక్రమం చేసి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంద వెంకటస్వామి, బ్రహ్మయ్య, డి. నారాయణ, బి కృష్ణ, టైలర్ శ్రీను, జి వెంకటస్వామి, గంధం విజయ్ కుమార్, జిటి బాలయ్య, ఆవుల శ్రీను, ఆవుల రమేష్, దాసరి పెంటయ్య, బి కృష్ణ, ఏ నాగేంద్రం, కాశీనాథ్, వెంకటకృష్ణ, గంజి నరసింహ, బుద్వేష్, లక్ష్మీనారాయణ, ఎస్ వెంకట స్వామి, వి మహేష్,డి. రాజు, జి రాములు, డి చిన్న మన్యం, ఎస్ బాలస్వామి, పెద్ది చిరంజీవి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



## సిజిఆర్‌ను కలిసిన ఫోటో, వీడియోగ్రాఫర్ల సంఘం

**టీ మీడియా, సెప్టెంబర్ 18, మేడ్చల్:**
సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ సిజిఆర్ కార్యాలయంలో ఈనెల 19, 20, 21 తేదీలలో హైదరాబాద్‌లో జరగబోయే ఫోటోగ్రాఫర్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు సంఘటితంగా ఉండాలని, ఎల్లప్పుడూ తన మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు వినోద్, ఉపాధ్యక్షులు ముత్తు, కోశాధికారి నవీన్, ప్రవీణ్, ప్రభాకర్, బాలా గౌడ్, సంపత్, శేఖర్, ప్రవీణ్, విజయభాస్కర్, పాల్గొన్నారు.



## సుంకరి సత్తయ్యకి నివాళులు

**టీ మీడియా, సెప్టెంబర్ 17,మేడ్చల్:**
ఇటీవల మరణించిన శంభీపూర్ నివాసులు సుంకరి సత్తయ్య (ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పెద్దనాన్న) దశదిన సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసుధనా చారి, కూకట్పల్లి ఏమ్మెల్యే మాధవరం కృష్ణ రావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలమల్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.







## ఫోటోగ్రాఫర్ల నూతన కమిటీ

**టీ మీడియా, సెప్టెంబర్ 18, చిన్న చింతకుంట:**
మహబూబ్నగర్ జిల్లా చిన్న చింతకుంట మండల కేంద్రంలో గల ఎంఎస్ గార్డెన్ లో ఫోటో గ్రాఫర్ ల నూతగా కమిటీ చేయడం జరిగింది అధ్యక్షులు పిటర్,ప్రధాన కార్యదర్శి డి.విద్య సాగర్, కోశాధికారి జి. శరత్ కుమార్,గౌరవ అధ్యక్షులు జి చిరంజీవిఉపాధ్యక్షులు జి రఘులనుఏనుకోవడం జరిగింది .ఫోటో గ్రాఫర్ యూనియన్ వారిని శాలువాతో సన్మానించరు యూనియన్ సభ్యులందరికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, చిన్నచింతకుంట మండలం బిఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కవిత ఎమోషనల్‌గా నిర్ణయం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**టి మీడియా, సెప్టెంబర్ 18,హైదరాబాద్ బ్యూరో:**
ఎమ్మెల్సీ కవిత రాజీనామా అంశంపై తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందించారు. కవిత రాజీనామాపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. రాజీనామా ఆమోదించాలని ఇటీవల ఎమ్మెల్సీ కవిత ఫోన్ చేశారని.. ఎమోషనల్‌గా నిర్ణయం తీసుకున్నారు, పునరాలోచన చేసుకోవాలని చెప్పానన్నారు. ఈ విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. కాగా.. సెప్టెంబర్ 3వ తేదీన కవిత %మీూజ% పదవికి రాజీనామా చేశారు. %దీ=ూ% ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూనే.. %మీూజ% సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. తర్వాత తన రాజీనామా ఆమోదించాలంటూ చైర్మన్‌ను కోరారు. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేటు ఆసుపత్రులకు ఇచ్చే నిధులతో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని.. ఆరోగ్యశ్రీ, %జవీ=ఖీ% కోసం ఖర్చు చేసే నిధులతో ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధికి కేటాయించండి.. గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు. నిమ్స్ తరహాలో అన్ని వైద్య కళాశాలను అభివృద్ధి చేయాలని కోరారు. యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇబ్బందులు తగ్గాలంటే ప్రభుత్వ కళాశాలను బలోపేతం చేయాలన్నారు. విద్య, వైద్యంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని.. గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు.





## మహిళలకు బతుకమ్మ కోలల పంపిణీ

**టీ మీడియా , సెప్టెంబర్ 18, పెద్దపల్లి బ్యూరో :**
కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామంలోని కోలాటం బృందాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలే శివప్రసాద్ ఆధ్వర్యంలో వారి సొంత ఖర్చులతో స్థానిక కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా మహిళ కోలాటం బృందాలకు కోలలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి తల్లిదండ్రులు బాల చంద్రమ్మ-ఐలయ్యల జ్ఞాపకార్థం గ్రామంలోని మహిళలందరికి కోలలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.కోలలను పంపిణీ చేసిన శివప్రసాద్ ను మహిళలు, నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడి అశోక్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ముస్కు మధుకర్, గుడ్ల శ్రీనివాస్, అనుముల రాజిరెడ్డి, బక్కల రామన్న, చీర ఓదెలు, రానవేన రామస్వామి,కూస సతీష్, నోముల కిరణ్,జాల్ల రాజ్ కుమార్, నోముల శ్రీనివాస్, జంగిలి రాజేష్, చీర్లంచ రమేష్, గుడ్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవనాన్ని పూర్తి చేయండి

- ఎంపిడిఓకు గ్రామస్థుల వినతి పత్రం

**టీ మీడియా,సెప్టెంబర్ 18,ఎండపల్లి:**
గుల్లకోట గ్రామంలో అసంపూర్తిగా ఉన్న నూతన గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తిచేసి,గ్రామ రికార్డులకు రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం గుల్లకోట గ్రామస్తులు ఎంపిడిఓకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు బెత్తపు శ్రీజ లక్ష్మీరాజం మాట్లాడుతూ గుల్లకోట గ్రామా పంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో కూరుకు పోయిందని పోతుందనిబుధవారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గుల్లకోట గ్రామ పంచాయతీ కి వెళ్ళగా పంచాయతి భవనం శిధిలావస్థకు చేరుకుందని,గ్రామ కార్యదర్శి కూర్చోవడానికి సరిఅయినా చోటు కుడా లేకుండా వర్షం నీరు కురుస్తుందని సరైన వసతులు లేక పంచాయతీ సిబ్బంది నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భవనం పై కప్పుకు పగుళ్లు ఏర్పడి పైకప్పు నుంచి వర్షం నీరు కురవడంతో పాటు స్టోరూం,గదులకు పదును ఏర్పడి కూలి పోయే ప్రమాదం ఉందని కార్యాలయం రికార్డులకు, వస్తువులకు సైతం రక్షణ లేకుండా పోయిందని,అవి కుడా తడిసి పోయే ప్రమాదం ఉందని, నూతనంగా కొలువు తీరిన ప్రజా ప్రభుత్వం, అధికారులు స్పందించి నిలచిపోయిన నూతన భవనం నిర్మాణం పనులు వెంటనే పూర్తి చెయ్యాలని కోరారు.





## యూరియా కోసం రైతుల ఆందోళన

**టీ మీడియా, సెప్టెంబర్ 18, అమరచింత :**
వనపర్తి జిల్లా అమరచింతలో యూరియా కొరత కారణంగా రైతులు ఆందోళనకు దిగారు. టోకెన్లు ఇచ్చినప్పటికీ యూరియా సరఫరా ఆలస్యమవడం, దొంగదారిలో పంపిణీ జరుగుతోందన్న అనుమానాలతో రైతులు రాస్తారోకో నిర్వహించారు.సుమారు నెల రోజుల క్రితం రైతులకు యూరియా కోసం టోకెన్లు ఇచ్చారు. టోకెన్ ఉన్నప్పటికీ వారం రోజులుగా ఎరువు అందక రైతులు నిరసన చేపట్టారు. రైతులు ఆరోపించిన దాని ప్రకారం, యూరియాను లైన్లో నిలబడి ఉన్న వారికి ఇవ్వకుండా పక్కదారిలో పంపిణీ చేస్తున్నారు రైతులు పేర్కొన్నారుఈ సందర్భంగా రైతులు రాస్తారోకు నిర్వహించి అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లారు.అధికారుల హామీసంఘటన స్థలానికి వ్యవసాయ అధికారి చేరుకున్నారు. టోకెన్ పొందిన ప్రతి రైతు నిబంధనలకు అనుగుణంగా యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.దీంతో రైతులు ఆందోళన విరమించారు.

# చంపింది ఎవరు? చనిపోయింది ఎవరు?

- శివారు ప్రాంతాల్లో మిస్టరీ డెత్‌లు
- గుర్తుతెలియని మృతదేహాల కలకలం

**టి మీడియా, సెప్టెంబర్ 18, హైదరాబాద్ బ్యూరో:**
హైదరాబాద్‌లో గుర్తు తెలియని మృతదేహాలు తరచూ వెలుగు చూస్తుండటం కలకలం రేపుతోంది. దుండగులు గిట్టని వారిని దారుణంగా హతమార్చి, గుట్టుగా తీసుకొచ్చి మూసీ నది, చెరువులు, కుంటలు, నిర్మానుష్య ప్రాంతాల దగ్గర పడేస్తున్నారు. శివార్లు, ఔటర్ రింగురోడ్డు సమీప ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే నగరంలో రెండు చోట్ల మహిళల మృతదేహాలు బయటపడటం ఇందుకు నిదర్శనం. కిస్మత్?పూర్?లోని నిర్మానుష్య ప్రాంతంలో దుస్తులు లేకుండా, చర్లపల్లి రైల్వేస్టేషన్? వద్ద బస్తాలో మూటకట్టిన స్థితిలో మృతదేహాలు వెలుగు చూడడం ఆందోళన కలిగిస్తోంది. కొన్నిచోట్ల ఎలాంటి ఆనవాళ్లు దొరక్కుండా దహనం చేస్తున్నారు. ఈ తరహా ఉదంతాల్లో నిందితులనే కాదు, మృతులను గుర్తించడం కూడా పోలీసులకు సవాల్?గా మారుతోంది.

**సమాచారం తర్వాతే వెలుగులోకి**
నేరస్తులు హత్యలు చేసేసుకొని, ఆ తర్వాత వాటి ఆనవాళ్లు కనిపించకుండా చేసేందుకు శివారు ప్రాంతాలనే ఎంచుకుంటున్నారు. ఇక్కడ జనసంచారం తక్కువగా ఉండటం, రాత్రివేళ కొన్ని ప్రాంతాల్లో మినహా అంతటా పెట్రోలింగ్



నిర్వహించడం సాధ్యపడదు. దీనికితోడు దట్టమైన చెట్లు, పొదలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో నేరాలు జరిగితే స్థానికులు గుర్తించి సమాచారమిచ్చిన తర్వాతే బయటకు వస్తున్నాయి. ఘటనలకు పాల్పడే ముందు ఆయా ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి ప్లేస్?లను ఎంచుకుంటున్నారు. కిస్మత్‌పూర్‌లో మృతదేహాన్ని వివస్త్రను చేసి, దాదాపు మూడు రోజులయింది. ఎవరూ గుర్తించకపోవడంతో మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. చర్లపల్లిలో లభ్యమైన మృతదేహమూ ఇలానే ఉంది.

**శివారు ప్రాంతాలనే ఎంచుకుని**
నగరంలోని రైలుపట్టాల వెంట దారుణ పరిస్థితులు ఉంటాయి. ఏటా సగటున 30దాకా మృతదేహాలు ఎవరివో గుర్తించలేని పరిస్థితి. పట్టాల వెంట సీసీ కెమెరాలు లేకపోవడం, నిర్మానుష్యంగా ఉండటంతో నేరగాళ్లు అవకాశంగా మార్చుకుంటున్నారు. ఇళ్లలో హత్యలు చేసి, శరీరాన్ని భాగాలు చేసి లేదా, మొత్తం సంచిలో లేదా బ్యాగ్?లో మూట కట్టి శివారు ప్రాంతాల్లో విసురుతున్నారు. కొందరైతే వెళ్లే దారిలో సీసీ కెమెరాలను గమనించి ఘటనలకు పాల్పడుతున్నారు.

**ఇతర రాష్ట్రాల వారే ఎక్కువ**
గుర్తుతెలియని మృతదేహాలు దొరికిన ఘటనల్లో మృతులు, నిందితులు ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందినవారే ఉంటున్నారు. ఉపాధి కోసం వచ్చిన వీరు కాలిబాటలు, ప్రార్థనా మందిరాల దగ్గర ఉంటున్నారు. తగాదాలు, ఇతర కారణాలతో వీరిని హతమారుస్తున్నారు. ఇటీవల కూకట్‌పల్లిలో రేణు అగర్వాల్ హత్య కేసులో నిందితులు జార్ఖండ్‌కు చెందినవారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొత్త వ్యక్తుల రాకపోకలపై నిఘా లేకపోవడం, కనీస నేర చరిత్ర తెలుసుకోకుండా పనుల్లో పెట్టుకోవడం వల్లే ఈ దారుణాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

**సీసీ కెమెరాలు, పెట్రోలింగ్ పెంచాలి**
ఇటీవల పెరిగిన హత్యల కారణంగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను బయటికి పంపించాలంటేనే జంకుతున్నారు. హైదరాబాద్? శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పెంచాలని స్థానికులు కోరుతున్నారు. పెట్రోలింగ్? కూడా పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఘటనల్లో దర్యాప్తు తొందరగా పూర్తి చేసి, నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రూ.300 కోట్లకు కుచ్చుటోపి..

- బాధితులంతా పెద్దోళ్లే

**టి మీడియా, సెప్టెంబర్ 18,హైదరాబాద్ బ్యూరో:**
మోసగాళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు..! పావలా ఆశ చూపి పది రూపాయలు టోపీ పెడుతున్నారు..! ఒకడేమో ఫ్రీలాంచ్ పేరుతో కోట్లు కొల్లగొడతాడు..! ఇంకొకడు పెట్టుబడుల పేరుతో సొంతం దోచేస్తాడు..! ఇలాంటి మోసాలు ప్రతిరోజూ వినిస్తూనే ఉన్నా.. బీ అలర్ట్ అంటూ పోలీసులు హెచ్చరిస్తున్నా అత్యాశతో బొక్కాబోర్లా పడుతున్నారు కొందరు. ఇప్పుడు అలాంటి మోసమే మరోటి వెలుగులోకొచ్చింది. సింగిల్ లేడీ 300 కోట్లు కొల్లగొట్టడం షాక్‌కు గురిచేస్తోంది.




ఈమె పేరు.. సంధ్యారాణి. ప్రముఖులు, అధికారులే ఈమె టార్గెట్. గార్మెంట్ కంపెనీలో డబ్బులు పెడితే అధిక వడ్డీలొస్తాయని ఎంతో మందిని బురిడీ కొట్టించింది. దాదాపు 300 కోట్ల రూపాయలు వసూలు చేసింది. ఈమె చేతిలో మోసపోయిన వైజాగ్‌కు చెందిన దొరైరాజు అనే వ్యక్తి.. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘరానా మోసం బయటపడింది. సంధ్యారాణిని అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.అయితే.. సంధ్యారాణి బాధితుల లిస్ట్‌లో ప్రముఖులతో పాటు %ఞూూ%లు, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు, ఎంతోమంది వస్త్ర వ్యాపారులున్నట్లు తేల్చారు. ఒకే గేటెడ్ కమ్యూనిటీలో సంధ్యారాణి 180 కోట్లు కలెక్ట్ చేయడం చూసి అధికారులే అవాక్కవుతున్నారు. అంతేకాదు.జి ఎస్ టి, టి ఎస్ సి. ఇన్‌వాయిస్‌లు మార్చి కస్టమర్లను బురిడీ కొట్టించినట్లు తెలిపారు. మోసం బయటకు రాగానే దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఇంటిపేరు మార్చి దుబాయ్ రెసిడెంట్ కార్డు కూడా పొందినట్లు పోలీసులు తేల్చారు.

# రూ.100, 200, 500 నకిలీ నోట్లు

- హైదరాబాద్‌లో దర్జాగా చలామణీ
- కమీషన్ తీసుకుని ముఠాలకు అప్పగింతలు

**టి మీడియా, సెప్టెంబర్ 18, హైదరాబాద్ బ్యూరో:**
హైదరాబాద్‌లో నకిలీ నోట్లు కలకలం సృష్టిస్తున్నాయి. చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని మాయగాళ్లు దర్జాగా చలామణి చేస్తున్నారు. గత రెండేళ్ల వ్యవధిలో 9 కేసులు నమోదు అయితే, ఈ ఏడాది ఇప్పటికే మూడు కమిషనరెట్ల పరిధిలో 15కు పైగా నకిలీ నోట్ల తయారీ, మార్పిడీపై కేసులు నమోదయ్యాయి. అంతర్రాష్ట్ర ముఠాలతో చేతులు కలిపిన కొందరు అడ్డదారిలో డబ్బు సంపాదించేందుకు ఈ మార్గం ఎంచుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కొన్ని ముఠాలు అసలు నోట్లను కలర్? జిరాక్స్ తీసి చలామణి చేస్తున్నారు. మరికొందరు యూట్యూబ్?లో వీడియోలు చూసి, యంత్రం తెచ్చుకుని మరీ తయారు చేస్తున్నారు. నగరానికి చెందిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు దొంగ నోట్ల తయారీ వైపు మళ్లారు.పాతబస్తీలో పచారీ దుకాణానికి వెళ్లిన యువకుడు రూ.200తో విలువైన వస్తువులు కొనుగోలు చేశాడు. రూ.500 నోటు ఇచ్చి మిగిలిన చిల్లర తీసుకున్నాడు. మరుసటి రోజు ఆ నోటును పరిశీలించిన ఒకరు అది నకిలీదిగా చెప్పారు. దీంతో కంగారు పడ్డ వ్యక్తి ఈ విషయం బయటపడితే కేసు తప్పదనే భయంతో దాన్ని చింపి పడేశాడు.



ఖైరతాబాద్ పరిధిలో తోపుడు బండి వద్ద పండ్లు కొని ఇదే తరహాలో నకిలీ నోటు అంటగట్టారు.ఇటీవల రాచకొండ పోలీసులు నకిలీనోట్ల తయారీ గుట్టు బట్టబయలు చేశారు. రూ.5 లక్షల నోట్ల కట్టలు, ప్రింటింగ్ మెషీన్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశారు. అద్భుతమైన చిత్రాలకు రూపమిచ్చే కళాకారుడు, ఆదాయం చాలక మిత్రులతో కలిసి ఈ దందా మొదలెట్టి పోలీసులకు పట్టుబడ్డాడు.కమీషన్? తీసుకుని ముఠాలకు అప్పగింత : శివారు గ్రామీణ ప్రాంతాలు, నగరంలోని కాలనీలు, నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకొని ఏజెంట్లు చాకచక్యంగా నోట్ల మార్పిడీ చేస్తున్నట్టు ఓ పోలీసు అధికారి తెలిపారు. చిరు వ్యాపారులు, హోటళ్లు, పాన్ దుకాణాలు, పెట్రోల్ బంకుల్లో రూ.500 నోటిచ్చి రూ.100-200 లావాదేవీలు జరుపుతారు. మిగిలిన సొమ్ములో కమీషన్ తీసుకొని ముఠాలకు అప్పగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒకే లావాదేవీలో 4-5 నకిలీ నోట్లు గుర్తించినప్పుడే పోలీసులు కేసు ఫైల్? చేస్తారు. ఫిర్యాదు చేస్తే కేసుల్లో ఇరుక్కుంటామనే భయంతో చాలామంది ముందుకు రావడం లేదు. ఇదే అదనుగా నకిలీ రాయుళ్లు చెలరేగుతున్నారు.
మార్కెట్‌లో ఎక్కువగా రూ.100, 200, 500 నకిలీ నోట్లు చలామణి అవుతున్నాయి. కాస్తజాగ్రత్తగాపరిశీలిస్తేఅసలు,నకిలీతేడానుగుర్తించొచ్చనినిపుణులుచెబుతున్నారు.రూ.500 నోటుపై సెక్యూరిటీ థ్రెడ్, డిజైన్, నాణ్యత చక్కగా ఉంటాయి. ఆంగ్ల పదాల్లో అక్షరాల్లో తేడా, నోటు రంగు చేతికి అంటుతున్నట్టు భావిస్తే అవి నకిలీవనే నిర్ధారించుకోవాలి.నోటుపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనే పేరులో రిజర్వ్ అనే పదంలో 'ఈ'కి బదులుగా 'ఏ' అక్షరం నకిలీ నోటుపై ఉంటుంది.అసలు నోటు స్ట్రిప్‌పై 500 సంఖ్య దేవనాగరి లిపిలో ఉంటుంది.నోటు మధ్యభాగంలో మహాత్మా గాంధీ చిత్రపటం కనిపిస్తుంది.500 సంఖ్య ఎలక్ట్రోటైప్ వాటర్ మార్క్, నోట్ల సిరీస్ సంఖ్యలు కుడిభాగంలో ఎడమనుంచి కుడికి సైజు పెరుగుతున్నట్టుకనిపిస్తాయి.

# మీ సేవలో అక్రమ వసూళ్లు

- రిజిస్ట్రేషన్‌లలో కొత్త దందా
- అదనంగా రూ.5 నుంచి 10 వేల

**టి మీడియా, సెప్టెంబర్ 18,ప్రత్యేకప్రతినిధి :**
పెద్దపల్లి జిల్లా ధర్మారంలోని ఓ మీ సేవ కేంద్రంలో ఇటీవల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారి నుంచి స్టాంప్ డ్యూటీ, ఫీజు, మ్యుటేషన్, ఇతర ఛార్జీలు అన్నీ కలిపి రూ.27,724 వసూలు చేశారు. రసీదు ఇవ్వమని అడిగితే నకిలీది ప్రింట్ చేసి చేతిలో పెట్టారు. తీరా కొన్నాళ్లకు అక్కడ ఉన్న మార్కెట్ విలువ ప్రకారం ఇంత ఛార్జీ కాదనే అనుమానంతో వారు ఆరా తీయగా అసలు ఛార్జీలు అన్నింటికి కలిపి రూ.19,724 అయినట్లు తేలింది. నమ్మి తమ వద్దకు వచ్చిన వారిని ఉమ్మడి జిల్లాలోనే చాలా కేంద్రాల్లో ఇదే తరహాలో మోసగిస్తూ అందినకాడికి మీ సేవ నిర్వాహకులు దండుకుంటున్నారు.జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఇటీవల కొందరు తహశీల్దారు లపై బదిలీ వేటు వేశారు. వీరు మీ సేవ కేంద్రాలను అడ్డు పెట్టుకుని అక్కడ మామూళ్లు ఇచ్చిన వారివే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని గుర్తించారు. ఎవరైనా నగదు ఇవ్వకపోతే ఏదో ఒక కారణాన్ని రిమార్క్‌గా రాస్తూ ప్రక్రియను పెండింగ్‌లో పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్లాట్




బుకింగ్ కూడా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అనుమతి ఉంటేనే బుక్ చేసుకోవాలని అంటున్నారు. ఎవరైనా నేరుగా ఆన్‌లైన్‌లో చేసుకుని వెళ్తే అభ్యంతరాల తిరకాసు పెడుతూ ఆ అప్లికేషన్?ను పక్కన పెడుతున్నారు.

**నేరుగా కాకుండా మధ్యవర్తుల సహాయం**
సదా అధికారుల సేవలో అన్నట్లుగా ఉమ్మడి జిల్లాలోని కొందరు మీ సేవ నిర్వాహకులు చక్రం తిప్పుతున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది అవినీతి నగదు బాధితుల నుంచి నేరుగా అందుకోకుండా కేంద్రాల సిబ్బందిని మధ్యవర్తులుగా ఉపయోగించుకుంటున్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్?లు కాకుండా ప్రతి మండల కేంద్రంలో తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్ అథారిటీ ఇవ్వడంతో మీ సేవ కేంద్రాలతో పాటు పలు ఆన్‌లైన్ కేంద్రాలు నడిపిస్తున్నవారు డాక్యుమెంట్ రైటర్లుగా అవతారం ఎత్తి మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. పనికింత అని వసూలు చేసి రిజిస్ట్రేషన్ అయ్యాక రెవెన్యూ యంత్రాంగంతో కలిసి సరి చూసుకుంటున్నారు.

**అదనంగా రూ.5 నుంచి 10 వేలు**
నాలుగు జిల్లాల పరిధిలో 603 మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 200కు పైగా పల్లెల్లో ఉండగా మిగతావి మండల కేంద్రాలు, పురపాలికల్లో ఉన్నాయి. ఇవే కాకుండా మండలానికి 5,6 చొప్పున ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. సగటున రోజుకు మండల పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్ కోసం 40 స్లాట్‌లకు అవకాశం ఇస్తున్నారు. కానీ సగం వరకు మాత్రమే బుక్ అవుతుంటాయి. బుక్? అయిన స్లాట్‌లకు సంబంధించి రెవెన్యూ సిబ్బందికి రిజిస్ట్రేషన్ ఫీజు, ఛార్జీలకు అదనంగా రూ.5 నుంచి 10 వేలు అందితేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.నాలా కన్వర్షన్, ఇతర తిరకాసున్న భూముల విషయంలో పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నారని సమాచారం. డాక్యుమెంట్‌లపై పెన్సిల్‌తో ఉన్న కోడ్‌ల ఆధారంగా లేదా ఆ కేంద్రాల నుంచి వచ్చిన వ్యక్తి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. నిజానికి వ్యవసాయ భూములలో పది గుంటలలోపు ఉన్నవి రిజిస్ట్రేషన్ చేయకూడదు. కానీ ముందే మాట్లాడుకున్న ఒప్పందం ప్రకారం ఆమ్యామ్యాలు చేతికి అందితే సరేనని అంటున్నారు. ఒకవేళ భూమిపై రుణం ఉంటే రిజిస్ట్రేషన్ చేయొద్దు కానీ మీ సేవ కేంద్రాల్లో మాట్లాడుకుంటే రిజిస్ట్రేషన్‌కు ఓకే అంటున్నారు.

# బతుకమ్మ, దసరా కోసం

- టీజీఎస్ ఆర్టీసీ 7,754 ప్రత్యేక బస్సులు
- 20 నుంచి అక్టోబర్ 2 వరకు

**టి మీడియా, సెప్టెంబర్ 18,ప్రత్యేకప్రతినిధి :**
బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు సిద్ధం చేసింది. మొత్తం 7,754 ప్రత్యేక బస్సులను నడపనుంది. రద్దీకి తగ్గట్లుగా ఈసారి గత దసరా కంటే అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ నెల 20 నుంచి అక్టోబరు 2 వరకు ఈ స్పెషల్? బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని సంస్థ ప్రకటించింది. అక్టోబరు 5,6 తేదీల్లో తిరుగు ప్రయాణానికి ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేసింది. ఈ బస్సుల్లో అదనంగా 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది.హైదరాబాద్?లో ప్రధాన బస్టాండ్లు అయిన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్?తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్?బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్?సుఖ్? నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడిపించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఆర్టీసీ ఈ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

**ముందస్తు రిజర్వేషన్? సౌకర్యం**
స్పెషల్ బస్సుల్లో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్



సౌకర్యాన్ని కల్పించింది. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, అక్టోబర్ 2న దసరా ఉన్నందున ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది.జీవో 16 ప్రకారం ప్రయాణికులపై అదనపు భారం : దసరా స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం ప్రయాణికులను తీసుకెళ్లి తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకే టికెట్ ధరలను సవరించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదీ వరకు వరకు, అక్టోబర్ 1,5,6వ తేదీల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే సవరణ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యులర్ సర్వీసుల ఛార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని యాజమాన్యం స్పష్టం చేసింది. అవి యథావిధిగా ఉంటాయి. ఈనెల 20వ తేదీన 662 బస్సులు, 27వ తేదీన 1,028 బస్సులు, 28వ తేదీన 1,010 బస్సులు, 29వ తేదీన 941 బస్సులు, 30వ తేదీన 824 బస్సులు, అక్టోబర్ 1వ తేదీన 884 బస్సులు నడిపించాలని నిర్ణయించింది.రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్?లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్?బీ, సంతోష్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, త్రాగునీరు, తదితర మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్? తెలిపారు. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నామన్నారు. ప్రయాణికుల రద్దీని గుర్తించి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారన్నారు. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోందని ?ఆర్టీసీ ఎండీ సజ్జనర్ పేర్కొన్నారు.ఈ నంబర్లకు కాల్? చేయండి : పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఇబ్బందులు పడొద్దని ఆర్టీసీ ఎండీ సజ్జనార్? సూచించారు. టీజీఎస్?ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్లను సంస్థ అధికారిక వెబ్ సైట్ %స్త్రంతీ౧ఎబం.అఱ% లో చేసుకోవాలని సూచించారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని తెలిపారు.

# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రులు

- శరవేగంగా ఏర్పాట్లు
- 6 వేల మంది పోలీసులతో భద్రత

**టి మీడియా, సెప్టెంబర్ 18,విజయవాడ:**
దసరా ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళికను నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సిద్ధం చేశారు. ఈసారి బందోబస్తు విధులు 'ఈ-డిప్లాయ్‌మెంట్' యాప్ ద్వారా కేటాయిస్తున్నారు. పోలీసులు ఎక్కడ రిపోర్టు చేయాలి? ఎక్కడ విధులు నిర్వహించాలి. వసతి తదితర సమాచారం అందులోనే పంపిస్తారు. ఎక్కడా తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా, ట్రాఫిక్ ఆగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై కసరత్తు చేస్తున్నారు.



**ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు**
సొంత వాహనాల్లో వచ్చే భక్తుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ కాకుండా పర్యవేక్షిస్తారు. కుమ్మరిపాలెంలోని టీటీడీ స్థలం, మున్సిపల్ కార్పొరేషన్ ఎదురు పాత పోలీస్ నివాస సముదాయం, బబ్బూరి గ్రౌండ్స్, భవానీ ఘాట్, బీఆర్టీఎస్ రోడ్డు, కృష్ణలంక పోలీసు స్టేషన్ ఎదురు సర్వీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేయాలని నిర్ణయించారు. ఆయా ప్రదేశాల్లో బోర్డుల ఏర్పాటు చేస్తున్నారు.

**సూచిక బోర్డులు ఏర్పాటు**
దుర్గమ్మ దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. దసరా వేడుకలతో పాటు ఈ సారి విజయవాడ ఉత్సవ్ కూడా నిర్వహిస్తున్నందున భక్తులు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ మార్గాల నుంచి నగరంలోకి వచ్చే వారు సులభంగా ఆలయానికి వెళ్లేలా ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 6 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అవసరమని గుర్తించారు. కమిషనరేట్‌లోని సిబ్బందితో పాటు ఇతర జిల్లాల నుంచి తీసుకురానున్నారు. వారందరూ రోజుకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు.

**డ్రోన్లతో నిఘా**
పర్యవేక్షణకు దాదాపు 15 డ్రోన్లు వాడనున్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటితో పాటు ఆయా దృశ్యాలు చూసేందుకు 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ సిద్ధం చేశారు. దొంగల కదలికల పైనా నిఘా ఉంచుతారు. చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలతో పాటు, సాధారణ దుస్తుల్లో 160 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు.కొండ కింద పర్యవేక్షణ బాధ్యతలు డీఐజీ ర్యాంకు అధికారికి, అదే విధంగా కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణకు ముగ్గురు ఎస్పీ స్థాయి అధికారులకు విధులు కేటాయిస్తున్నారు. తొక్కిసలాటకు జరిగే అవకాశం లేకుండా ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. సీతమ్మ వారి పాదాలు, పూల మార్కెట్ పక్కన కూడా కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయనున్నారు. గతంలో అయితే కేఎల్‌రావు హెడ్ వాటర్ వర్క్స్ వరకు మాత్రమే క్యూలైన్ ఉండేది. దానిని ఈసారి కుమ్మరిపాలెం వరకు పొడిగిస్తున్నారు.దసరా ఏర్పాట్లు భారీ ఎత్తున చేస్తున్నట్లు సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. ఆపరేషన్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విజయవాడ నగరం మొత్తం 12 వేల సీసీ కెమెరాలతో పర్యవేక్షణ జరుగుతుందని ఆయన అన్నారు. దర్శన సమయాలను ఇవ్వడం ద్వారా సులభంగా భక్తులకు దర్శనం అయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అసెంబ్లీ, విజయవాడ ఉత్సవ్, ఉచిత బస్సు నడుస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది దసరా ఉత్సవాలకు 4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈసారి దసరా వేడుకలకు మహిళా పోలీసుల సేవలను ఉపయోగిస్తామన్నారు. ఈ దసరా ఉత్సవాలకు వీఐపీలు సహకరించాలని ఆయన కోరారు.

# తిరుమల బ్రహ్మోత్సవాలు

- ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు
-టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

**టీ మీడియా , సెప్టెంబర్ 18,: తిరుమల** తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యాక జరుగుతున్న తొలి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్? బీఆర్? నాయుడు తెలిపారు. రద్దీకి అనుగుణంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. స్వయంగా వచ్చే ప్రముఖులకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తామని, సిఫారసు లేఖలు బ్రహ్మోత్సవాల సమయంలో అనుమతించమని స్పష్టం చేశారు.గ్యాలరీలో ఉండే భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. గరుడ సేవ రోజున తిరుమలకు ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదన్నారు. బ్రహ్మోత్సవాలలో ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను అందజేస్తారన్నారు. బ్రహ్మోత్సవాలకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్? హాజరవుతారని తెలిపారు. సాంకేతికతను వినియోగిస్తూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని ఛైర్మన్? బీఆర్? నాయుడు వివరించారు.గత బ్రహ్మోత్సవాల్లో లోపాలను గుర్తించి ప్రత్యేకమైన భద్రత చర్యలు చేపట్టామని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో భద్రత కోసం తిరుమలలో మూడు వేల మంది తిరుపతిలో వెయ్యి మంది పోలీసులను వినియోగిస్తున్నామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. వేచి ఉండే భక్తులకు నిరంతరం అన్నప్రసాదాలు, నీరు వంటివి పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గరుడ సేవ రోజు తిరుమల కనుమ రహదారుల్లో ద్విచక్రవాహన రాకపోకలపై ఆంక్షలు విధించామని తిరుమల వచ్చే భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా రావాలని కోరారు.తిరుపతిలో 5 ప్రాంతాలలో పార్కింగ్? స్థలాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 4 వేల సీసీ కెమెరాల ద్వారా బ్రహ్మోత్సవాలను పర్యవేక్షిస్తామన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. 1500 మంది విజిలెన్స్ సిబ్బంది బ్రహ్మోత్సవాల విధుల్లో పాల్గొననున్నట్లు టీటీడీ ముఖ్య భద్రత అధికారి సీవీఎస్?ఓ మురళీకృష్ణ తెలిపారు. విజిలెన్స్?తో పాటు అనుబంధ విభాగాలైన ఆక్టోపస్, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు నిరంతరం భక్తుల భద్రతను పర్యవేక్షిస్తారన్నారు. నిఘా వ్యవస్థలో ఎలాంటి లోపం లేకుండా పని చేస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందన్నారు.మరోవైపు భక్తుల సౌకర్యార్థం డిసెంబరు నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల కోటాను ఈ నెల 18వ తేదీ (గురువారం) ఉదయం 10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటి ఎలక్ట్రానిక్ లక్కీడిప్ కోసం 20న ఉదయం పది గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అంగప్రదక్షిణ టోకెన్లను ఇదే విధానంలో నమోదు చేసుకున్నాక ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా జారీ చేస్తారు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు 22వ తేదీ మధ్యాహ్నంలోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. 22న ఉదయం పది గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు.23న ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. 24న ఉదయం పదింటికి ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం మూడింటికి అద్దె గదుల బుకింగ్ కోటా అందుబాటులో ఉంటుంది. భక్తులు https://ttdevasthanams.ap.gov.in లో మాత్రమే ఆర్జితసేవలు, సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం సూచించింది.





# ప్రోటోకాల్ వివాదం

-కలెక్టర్ పై ప్రభుత్వం సీరియస్..!

**టీ మీడియా , సెప్టెంబర్ 18,రాజన్న సిరిసిల్ల :**ప్రోటోకాల్ విషయంలో రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌పై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. బుధవారం ప్రజా పరిపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని ప్రభుత్వం సీరియస్ తీసుకున్నది. జెండా ఆవిష్కరణ సమయానికి హాజరుకాకపోవడంతో పాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకడంలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించారు. దాంతో ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్ ఈ విషయాన్ని సీఎంవోతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో ఈ విషయంలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని సర్కారు నోటీసులు ఇచ్చింది. అధికారిక కార్యక్రమంలో కలెక్టర్ నిబంధనలు పాటించకపోవడాన్ని ప్రభుత్వం తప్పుపట్టింది. గురువారం జిల్లావ్యాప్తంగా విప్ ఆదికి మద్దతుగా బీసీ సంఘాల నేతలు నిరసన తెలిపారు. ఈ క్రమంలోనే కలెక్టర్‌కు సీఎస్ నోటీసులు ఇచ్చారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల్లోగా వివరణ ఇవ్వాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వరుస వివాదాలతో చిక్కుల్లోపడ్డారు. కోర్టు ధిక్కరణ విషయంలో తెలంగాణ హైకోర్టు వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే.ఓ భూ నిర్వాసితుడి విషయంలో కోర్టు బుధవారం వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. మిడ్ మానేరు ప్రాజెక్టు కింద ఇల్లు కోల్పోయిన చీర్లవంచ గ్రామానికి చెందిన వేల్పుల ఎల్లయ్య అనే నిర్వాసితుడికి పరిహారం చెల్లించలేదని.. కోర్టు ఆదేశాలను పాటించలేదంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కింద కలెక్టర్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అయితే, బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమానికి కలెక్టర్ ఝా ఆలస్యంగా వచ్చారు. కలెక్టర్ వచ్చే సమయానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలికేందుకు రాకపోవడంతో పాటు జెండా ఆవిష్కరణ సమయం వరకు అక్కడ లేకపోవడం వివాదానికి కారణమైంది.